సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం । 17 । ఏప్రిల్ । 2023



బీసీల కల సాకారం

బీసీల కులగణనకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడంపై బీసీ సంఘాల నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. 8లో



పాల దిగుబడిపై వడ'దెబ్బ'

వేసవిలో పశువులకు వడదెబ్బ తగలకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. 8లో



ముగిసిన గ్రాండ్ ఎక్స్‌పో

నూజివీడు ట్రిపుల్‌ఐటీలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఐఓటీ గ్రాండ్ ఎక్స్‌పో-23 ఆదివారంతో ముగిసింది. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమవారం సాయంత్రం)	సహరి (మంగళవారం వేకువజాము)
భీమవరం	6.26	4.24
తాడేపల్లిగూడెం	6.28	4.34
నరసాపురం	6.26	4.22

న్యూస్‌రీల్

అంబేడ్కర్ ఫ్లెక్సీ చించివేతపై వివాదం



తూర్పువిప్పర్రులో ఆందోళన చేస్తున్న దృశ్యం

ఇరగవరం : మండలంలోని తూర్పువిప్పర్రులో అంబేడ్కర్ ఫ్లెక్సీని కొందరు చించివేయడంపై ఆదివారం ఆందోళన చెలరేగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని గ్రామానికి చెందిన ఎస్సీ యువకులు ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. ఈ నేపథ్యంలో ఎస్సీ యువకులు రాపాక గ్రామానికి భోజనానికి వెళ్లి వస్తుండగా వేరే సామాజిక వర్గానికి చెందిన యువకులు ఫ్లెక్సీ తొలగించాలని వీరిని హెచ్చరించారు. అయితే వారి మాటలను ఎస్సీ యువకులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో శనివారం రాత్రి అంబేడ్కర్ ఫ్లెక్సీని వేరే సామాజిక వర్గానికి చెందిన యువకులు చించివేశారని ఎస్సీ యువకులు ఉదయం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. అదే సమయంలో వేరే సామాజిక వర్గానికి చెందిన యువకులు అక్కడకు రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. జిల్లా ఎస్పీ రవిప్రకాష్, డీఎస్పీ మనోహర ఆచారి, తణుకు ,పెనుగొండ, పాలకొల్లు సీఐలు, ఇరగవరం ఎస్సై, 150 మంది కానిస్టేబుళ్లు సంఘటనా స్థలానికి చేరుకుని ఘర్షణను అదుపుచేశారు. రెండు ఎస్సీ, ఎస్టీ కేసులు, మరో రెండు కేసులు మొత్తంగా నాలుగు కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో 144 సెక్షన్ పెట్టి పోలీస్‌పికెట్ ఏర్పాటుచేశారు.

విధుల్లోకి 98 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు

ఆకివీడు: డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులు విధుల్లో చేరినట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.రవీంద్ర తెలిపారు. ఆకివీడు మండలంలో ముగ్గురు, కాళ్ల మండలంలో ఆరుగురు, ఉండి మండలంలో ముగ్గురు విధుల్లో చేరారన్నారు. సోమవారం వారి నుంచి అగ్రిమెంట్ తీసుకుంటామన్నారు. ఆకివీడు మండలానికి చెందిన 10 మందిలో ముగ్గురికి స్థానికంగా, మిగిలిన వారు వేరే మండలాల్లో పోస్టింగులు వచ్చాయని, వారంతా ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరారని చెప్పారు.

సబార్డినేట్ ఖాళీలు భర్తీ చేయాలి

తణుకు టౌన్: రాష్ట్రంలో వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయాల్లో ఖాళీగా వున్న సబార్డినేట్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఏపీ వాణిజ్య పన్నుల శాఖ ఆఫీస్ సబార్డినేట్స్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల గోపాలకృష్ణయ్య కోరారు. ఆదివారం తణుకు ఎన్జీఓ భవనంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 1,181 సబార్డినేట్ ఉద్యోగాలు ఉండగా 554 మంది మాత్రమే పనిచేస్తున్నారన్నారు. ఉన్నవారిలో పలువురు రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉన్నారని, వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఈ మేరకు మంత్రి రాజేంద్రనాథ్‌రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, చీఫ్ కమిషనర్లకు వినతి పత్రాలు అందించామన్నారు. రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ సబార్డినేట్స్ ఉద్యోగుల కేడర్‌ను రెండోసారి పునర్వ్యవస్థీకరించాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం మురుగేశన్, ఉపాధ్యక్షుడు పి.సత్తిరాజు, కోశాధికారి జగన్నాథం, ఏలూరు డివిజన్ అధ్యక్షుడు డీవీ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీహరి, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

30న హేలాపురి వేసవి ఉత్సవం

ఏలూరు (టూటౌన్): హేలాపురి వేసవి ఉత్సవాన్ని ఈనెల 30న నిర్వహించనున్నట్టు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ తెలిపారు. స్థానిక పవరుపేటలోని ఏపీఆర్ విజ్ఞాన కేంద్రం భవనంలో ఆదివారం ఆయన బ్రోచర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30న ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు ఒక కేటగిరీగా, ఒకటి, రెండు తరగతుల విద్యార్థులు ఒక కేటగిరీగా, కాలేజీ విద్యార్థులు ఒక కేటగిరీగా, 25–60 ఏళ్ల వారు ఒక కేటగిరీగా, 60 ఏళ్లు పైబడిన వారు ఒక కేటగిరీగా మొత్తం 28 అంశాల్లో ప్రతిభాపాటవ ప్రదర్శనలు నిర్వహిస్తామని చెప్పారు.

వరి సిరులు

ఆకివీడు: దాళ్వా వరిసిరులు పండించింది. నిండా కంకులతో బంగారు వర్ణంలో వరి చేలన్నీ కళకళలాడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా దిగుబడులతో రబీ సీజన్ చరిత్ర సృష్టించనుంది. ప్రభుత్వ ముందస్తు చర్యల్లో భాగంగా అవలంబించిన వంతుల వారీ విధానం సత్ఫలితాలను ఇచ్చింది. పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులు 120 రోజులపాటు వరిసాగుకు పూర్తిస్థాయిలో నీరందించగలిగారు. అలాగే పెట్టుబడులు తక్కువ కావడం కూడా రైతులకు మేలు చేస్తోంది. రాష్ట్రంలో అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న వైఎస్ జగన్ సర్కారు విత్తు నుంచి పంట చేతికి వచ్చేవరకూ అన్నివిధాలా అండగా ఉంటోంది. రైతు భరోసా, వడ్డీ రాయితీ, అందుబాటులో విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు సరైన నీటియాజ్య పద్ధతులు పాటించడంతో ఉత్సాహంగా రబీ సాగు సాగింది.

పంట పండింది

- ఆశాజనకంగా దిగుబడులు
- కలిసొచ్చిన వంతుల వారీ విధానం
- అనుకూలించిన వాతావరణం
- 2.13 లక్షల ఎకరాల్లో రబీ సాగు
- 9.28 లక్షల టన్నుల దిగుబడి లక్ష్యం



ఆకివీడు ధర్మాపురం ప్రాంతంలో మాసూళ్లు పూర్తి చేసుకుని ధాన్యాన్ని ఆరబెట్టిన దృశ్యం

80 శాతానికి పైగా శ్రీధృతి

పశ్చిమగోదావరి జిల్లాలో రబీ సీజన్‌లో 2.13 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. ధాన్యం దిగుబడి లక్ష్యం 9.28 లక్షల టన్నులు కాగా అంతకుమించి దిగుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కలెక్టర్ పి.ప్రశాంతి సమక్షంలో ప్రయోగాత్మకంగా పరీక్షలు నిర్వహించగా ఆకుతీగపాడులో 60 బస్తాల దిగుబడి వచ్చింది. 45 నుంచి 50 బస్తాల (75 కిలోల బస్తాలు) వరకు ఎక్కువగా దిగుబడులు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో 80 శాతానికి పైగా రైతులు ఎంటీయూ 1121 శ్రీధృతి రకం వంగడాన్ని సాగు చేశారు.



ఆకివీడు ప్రాంతంలో బంగారు వర్ణంలో చేలు

లాభాల 'వంతు'

వారం విడిచి వారం వంతులో సాగునీరు సరఫరా చేయడం రైతులకు లాభించింది. వంతుల వారీ విధానంతో చేనుకు సరిపడే నీరు అందడమే కాకుండా, భూమిలో ఉన్న లోపాలు బయటకుపోయే అవకాశం ఏర్పడింది. పొలంలో నీరు నిలబడక పోవడంతో భూమి నెర్రలు దీసి దానిలో ఉండే మిథేన్, సల్ఫర్ వంటి విషవాయువులు బయటకు పోవడంతో వరి మొక్కలు మరింత స్వేచ్ఛగా, ఆరోగ్యకరంగా ఎదుగుతున్నాయని అధికారులు, శాస్త్రవేత్తలు గుర్తించారు. తడి, పొడి విధానంతో వరి మొక్క మరింత ఆరోగ్యకరంగా ఎదిగి, దుబ్బులు వేసి, అధిక పిలకలు, కంకులతో దిగుబడులను ఇచ్చింది.

చీడపీడలు దూరం

రబీ సాగులో వంతుల వారీ నీటి విధానం, వాతావరణం అనుకూలించడంతో పాటు చీడపీడలు దరిచేరలేదు. ఎక్కడా ఎలక్కొట్టుడు, దోమపోటు కనిపించలేదు. దీంతో రైతులకు పెట్టుబడులు కలిసొచ్చాయి. ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు పురుగుమందుల పిచికారీ ఖర్చు తగ్గింది. అకాల వర్షాలకు పూత దశలో ఉన్న వరి అక్కడక్కడా కొద్దిగా దెబ్బతిన్నా దిగుబడులపై ప్రభావం చూపలేదు.

60 బస్తాలకు పైగా..



రబీ సాగులో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. వరి కోత పరీక్షలు నిర్వహించగా ఎకరాకు 60 బస్తాలకు పైగా దిగుబడి వచ్చింది. సగటున 75 కిలో బస్తాలు 45 నుంచి 50 వరకు రావచ్చు. వంతుల వారీ విధానం, శ్రీధృతి వంగడం, అనుకూల వాతావరణమే ఇందుకు కారణం.

– జెడ్.వెంకటేశ్వర్లు, జేడీ, వ్యవసాయశాఖ, పశ్చిమగోదావరి జిల్లా

పెట్టుబడులు తగ్గాయి



రబీ సాగులో పెట్టుబడులు బాగా తగ్గాయి. ఎలక్కొట్టుడు తగ్గడం, దోమపోటు లేకపోవడంతో దిగుబడులు బాగున్నాయి. వంతుల వారీ నీటితో సాగు బాగా సాగింది. రైతులకు పెట్టుబడిగా ప్రభుత్వం ద్వారా రైతు భరోసా సొమ్ము అందడంతో దళారుల బెడద లేదు.

– బలే గంగరాజు, రైతు, కాళింగగూడెం, ఆకివీడు మండలం

అందరికీ అందుబాటులో ఉంటూ..

జాయింట్ కలెక్టర్ రామసుందర్‌రెడ్డి



భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తానని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. నూతన పశ్చిమగోదావరి జిల్లాకు జేసీగా రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. తన స్వస్థలం కడప అని, తాను 2015 బ్యాచ్ ఐఏఎస్ అని తెలిపారు. కర్నూలు జిల్లా జేసీగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చానని, గతంలో తుడా సెక్రటరీ, హౌసింగ్ కార్పొరేషన్ ఈడీతో పాటు ఉమ్మడి రాష్ట్రంలో పలు పోస్టుల్లో పనిచేశానని చెప్పారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

పశ్చిమగోదావరి జిల్లా అంటే వ్యవసాయానికి నిలయమని, ఇక్కడ రైతులు సుమారు 5 లక్షల ఎకరాల్లో ధాన్యాన్ని పండిస్తున్నారని, అన్నివిధాలా అండగా ఉంటూ వారి సంక్షేమానికి కృషిచేస్తానని జేసీ అన్నారు. ముఖ్యంగా దళారుల చేతిలో మోసపోకుండా నేరుగా పంటలను రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పాలనా పరంగా..

వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు నేరుగా సేవలందుతున్నాయని, మరింత వేగంగా, సులభంగా సేవలు అందించేందుకు నిరంతరం సచివాలయాలను పరిశీలిస్తామని జేసీ తెలిపారు. అలాగే సచివాలయ సిబ్బందికి సేవలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రీ సర్వేకు ప్రాధాన్యం

తాను పనిచేసిన ప్రాంతంలో 100 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామని, జిల్లాలో ఫేజ్-2 రీసర్వే పనులు వేగంగా జరిగేలా కృషిచేస్తానని జేసీ అన్నారు. కలెక్టర్ సూచనలు, సలహాలతో రీసర్వేలో ఉన్న అధికారులు, సాంకేతిక సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ రీ సర్వే పనులు చురుగ్గా జరిగేలా చర్యలు తీసుకుంటామని జేసీ రామసుందర్‌రెడ్డి అన్నారు.

వైభవంగా గరుడోత్సవం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్ర ఉపాలయం లక్ష్మీపురంలోని సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుని కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గరుడోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. లక్ష్మీపురం ఆలయం నుంచి పక్క గ్రామమైన తిమ్మాపురం వరకు సాగిన ఉత్సవం ఆద్యంతం భక్తులకు కనువిందు చేసింది. కల్యాణం జరిగిన మరుసటి రోజు రాత్రి ఈ వేడుకను నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా ఉభయ దేవేరులతో స్వామివారిని అర్చకులు గరుడ వాహనంపై ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం వాహనాన్ని విశేషంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ఊరేగింపు తిమ్మాపురం గ్రామానికి చేరుకుంది. అక్కడి ప్రజలు దేవదేవునికి ఘన స్వాగతం పలుకుతూ అడుగడుగునా నీరాజనాలు సమర్పించారు.



గరుడ వాహనంపై ఆశీనులైన స్వామి, అమ్మవార్లు

వీఆర్వోల సంఘ కార్యవర్గం ఎన్నిక



భీమవరంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

సాక్షి, భీమవరం: జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. భీమవరంలోని త్యాగరాజ భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సంఘ గౌరవాధ్యక్షుడు ఎం.బాపూజీ, ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీరామచంద్రమూర్తి ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా భూపతిరాజు రవీంద్రరాజు, మిరియాల లక్ష్మీనారాయణ, కోశాధికారిగా గుర్రం చిట్టిబాబు, ఉపాధ్యక్షులుగా వాసిరెడ్డి ఏసుబాబు, గుంపర్తి శ్రీనివాసరావు, కోరశిఖ రాంబాబు, ఆకుల బాబు రాజేంద్రప్రసాద్, మీసాల భద్రమ్మతోపాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 20 మండలాలకు చెందిన రెవెన్యూ ఉద్యోగులు హాజరయ్యారు.





అభివృద్ధి బాటలు

రాష్ట్రంలో రహదారుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గోతులతో నిండి, చిన్నపాటి వర్షానికే అధ్వానంగా మారిన రోడ్లను సుందరంగా తీర్చిదిద్దుతోంది. తణుకు నుంచి వేల్పూరు వెళ్లే రహదారి వీరభద్రపురం వద్ద ఛిద్రంగా మారగా.. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. రూ.35 లక్షల నిధులు మంజూరు చేయించి 150 మీటర్ల మేర రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. - తణుకు టౌన్

అభాగ్యులపై వాత్సల్యం

మిషన్ వాత్సల్య పథకం

- నెలకు రూ.4 వేలు అందజేత
- గతేడాది 371 మందికి సాయం
- ఈ ఏడాది 6,315 మంది దరఖాస్తు



మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజ

భీమవరం(ప్రకాశం చౌక్): అనాథలు, అభాగ్యులుగా మారిన 6 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న మిషన్ వాత్సల్య పథకం భరోసాగా నిలుస్తోంది. ఈ పథకం కింద నెలకు రూ.4 వేల చొప్పున ఏడాదిపాటి ఆర్థిక సాయం అందిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.1,400, కేంద్ర ప్రభుత్వం రూ.2,600 చొప్పున అందిస్తున్నాయి. ఓ పక్క ఉచితంగా చదువును అందిస్తూ మరోపక్క ప్రత్యేక ఆర్థిక సాయం ద్వారా అభాగ్యులైన బాలలకు ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ పథకాన్ని అమలులోకి తీసుకువచ్చారు.

లబ్ధిదారులు ఎవరుంటే..

- తల్లితండ్రులు కోల్పోయిన, తల్లితండ్రులు దూరమైన పిల్లలు.
- పాక్షిక అనాథలైన (తల్లి లేక తండ్రి కోల్పోయిన), విడాకులు పొందిన తల్లితండ్రులు ఉన్న పిల్లలు.
- కుటుంబాన్ని వదిలివేసిన, తల్లితండ్రులు ప్రాణాంతకమైన వ్యాధి బారిన పడిన వారి పిల్లలు.
- పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయిన పిల్లలు.
- బాలల న్యాయ ఆదరణ, సంరక్షణ చట్టం 2015 ప్రకారం ఇల్లు లేని పిల్లలు
- ప్రకృతి వైపరీత్యానికి గురైన బాలలు, బాల కార్మికులు.
- అక్రమ రవాణా, దాడులకు గురైన బాలలు, బాల యాచకులు.
- బాల్యవివాహ బాధితులు, హెచ్‌ఐవీ బాధిత, దివ్యాంగులు తదితర పిల్లలు.

గతేడాది రూ.1.78 కోట్లు అందజేత

మిషన్ వాత్సల్య పథకం ద్వారా గతేడాది జిల్లాలో 371 మంది పిల్లలకు నెలకు రూ.4 వేల చొప్పున రూ.1.78 కోట్లు అందించారు. ఈ ఏడాది 6,315 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను మండల స్థాయి స్క్రూటినీ కమిటీ సభ్యులు తహసీల్దార్, ఎంపీడీఓ లేదా మున్సిపల్ కమిషనర్ ఎంఈవో, సీడీపీఓ, సూపర్‌వైజర్ దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి నెలకు రూ.4 వేల చొప్పున 12 నెలలపాటు ఆర్థిక సాయం అందిస్తారు. గతేడాది లబ్ధిదారులను రెన్యూవల్ చేయడంతో పాటు కొత్తవారితో పాటు వారికి కూడా ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ ఏడాదికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ గడువు శనివారంతో ముగిసింది.

దరఖాస్తుల స్వీకరణ

ఐసీడీఎస్ ప్రాజెక్ట్	దరఖాస్తులు
పెనుమంట్ర	538
పాలకొల్లు	999
ఆకివీడు	1,386
భీమవరం	414
తణుకు	1,304
తాడేపల్లిగూడెం	669
మొగల్తూరు	1,005

ప్రతినెలా ఆర్థిక సాయం



మా నాన్న కోవిడ్ కారణంగా చనిపోయారు. నన్ను మా అమ్మ చూసుకుంటోంది. మిషన్ వాత్సల్య పథకం ద్వారా నాకు ప్రతినెలా ఆర్థిక సాయం అందుతోంది. ఈ పథకం తల్లితండ్రులు లేని పిల్లలకు భరోసాగా ఉంది. అభాగ్యులైన పిల్లల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందించడం మంచి కార్యక్రమం.

– పట్నాల శ్రీవాణి, విద్యార్థిని, 18 వార్డు, భీమవరం

6,315 దరఖాస్తులు



గతేడాది అర్హులు 371 మంది కాగా రెన్యూవల్‌తో కలుపుకుని ఈ ఏడాది 6,315 దరఖాస్తులు వచ్చాయి. మండల స్క్రూటినీ కమిటీ పరిశీలన అనంతరం అర్హులను ఎంపిక చేస్తారు. ఏడాది పాటు లబ్ధిదారులకు నెలకి రూ.4 వేల చొప్పున అందిస్తారు.

– బి.సుజాతరాణి మహిళ, శిశు సంక్షేమ శాఖ పీడీ

చంద్రబాబును అరెస్ట్ చేయాలి



చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాజధాని ప్రాంతంలో రైతులను నిండా ముంచి రూ.3.50 లక్షల కోట్లను దోచుకున్న చంద్రబాబును అరెస్ట్ చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుళ్లూరు మండలం, తాళ్లాయిపాలెం, సీడ్ యాక్సెస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులు కోరుతూ 932 రోజులుగా జరుగుతున్న నిరాహార దీక్షలకు మాల మహానాడు తరఫున మద్దతు తెలిపారు. చంద్రబాబు దగ్గర సూట్‌కేసులు తీసుకున్న కొందరు దళిత దళారులు ఎల్లో మీడియాలో కోట్ల రూపాయలు దోచేసిన రామోజీని పొగడం ఎంత వరకు సబబో ఆలోచించాలని హితవు పలికారు. దళితుడిగా పుట్టాలని ఎవరు కోరుకుంటారన్న చంద్రబాబుకు వత్తాసు పతుకుతూ ప్యాకేజీలు తీసుకొని దళిత జేఏసీ పేరుతో దిగజారడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో 35 లక్షల మందికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. చిట్‌ఫండ్ మోసాలతో దోచుకున్న కేసుల్లో రామోజీరావు బండారం బయటపడిందన్నారు. ఎల్లో మీడియా పత్రికలను అడ్డం పెట్టుకొని ఎన్ని తప్పుడు రాతలు రాసుకున్నా చట్టాన్ని ఉల్లంఘించిన కేసుల్లో అరెస్టు తప్పదన్నారు. మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు మానుకొండ నాగేశ్వరరావు, నాయకులు బి.సందీప్, బి.సునీల్‌బాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అగ్నిప్రమాదంలో బ్యారన్‌లు దగ్ధం



అగ్నిప్రమాదంలో మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెం సమీపంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో సతీష్ అనే వ్యక్తి చెందిన 2 పొగాకు బ్యారన్‌లు దగ్ధమయ్యాయి. పొగాకు క్యూరింగ్ చేస్తుండగా ఈ అగ్నిప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న జంగారెడ్డిగూడెం అగ్నిమాపక అధికారులు ఇక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

జంగారెడ్డిగూడెం: అక్రమంగా రేషన్ బియ్యం కలిగి ఉన్న నేరంపై ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం జంగారెడ్డిగూడెంలోని విరోధుల వారివీధిలో జె.శ్రీనివాసరావు అనే వ్యక్తి అక్రమంగా 4 క్వింటాళ్ల రేషన్ బియ్యం కలిగి ఉండటంతో, ఆర్‌ఐ కమలకుమారి, సిబ్బంది దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారన్నారు. కమలకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కులగణనతో బీసీల కల సాకారం

సీఎం జగన్ నిర్ణయం చరిత్రాత్మకం: బీసీ సంఘాలు

ఏలూరు (టూటౌన్): బీసీలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కుల గణనకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపడం పట్ల బీసీ సంఘాలు, నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గత 20 ఏళ్ళుగా జాతీయ స్థాయిలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర బీసీ చైతన్య సమితి అధ్యక్షుడు కేశన శంకర్రావు వంటి నేతలు పోరాటాలు చేస్తున్నారు. జాతీయ స్థాయిలో వివిధ బీసీ సంఘాల నాయకులను కలుపుకుని పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు, ప్రతిపక్ష నాయకులకు, ఎంపీలకు వినతి పత్రాలు ఇస్తూ వచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వద్ద ఈ విషయాన్ని విన్నవించారు.



ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న బీసీ సంఘాలు, బీసీ ఉద్యోగ సంఘాల నాయకులు

బీసీల ఆకాంక్షను గుర్తెరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా రాష్ట్రంలో బీసీ కులగణనకు జై కొట్టారు. పూలే జయంతి కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ ఈ విషయాన్ని వెల్లడించారు. ఇప్పటికే బీసీ కులగణనకు మద్దతుగా రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసిందని గుర్తు చేశారు.

బీసీ సంఘాల హర్షాతిరేకాలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్ణయం పట్ల జిల్లాలోని బీసీ సంఘాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి. గత 20 ఏళ్ళుగా ఢిల్లీ స్థాయిలో బీసీ కులగణన చేపట్టాలంటూ పలు పోరాటాలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేస్తున్నాయి. తమ పోరాటం వృథా కానివ్వకుండా రాష్ట్రంలో బీసీల కులగణనకు సీఎం నిర్ణయం తీసుకోవడం గొప్ప చారిత్రాత్మక విషయమని అభివర్ణిస్తున్నారు. రాష్ట్రంలోని యావత్ బీసీలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఎంతో రుణపడి ఉంటారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం నిర్ణయం చరిత్రాత్మకం



రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టేందుకు ముఖ్యమంత్రి నిర్ణయం ఎంతో చరిత్రాత్మకమైంది. ఎంతో కాలంగా దేశవ్యాప్తంగా ఓబీసీ కులగణన చేపట్టాలని కోరుతూ సభలు, సమావేశాలు నిర్వహించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వినతులు అందజేసాం. మా బాధను రాష్ట్ర ప్రభుత్వం అర్థం చేసుకుని దీనిపై సానుకూల నిర్ణయం తీసుకోవడం ఎంతో శుభపరిణామం.

వీరవల్లి శ్రీనివాస్,
రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ చైతన్య వేదిక, భీమవరం

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ఎన్నో ఏళ్ళుగా ఎదురు చూస్తున్న కలను సాకారం చేసేలా రాష్ట్రంలో బీసీ కులగణన నిర్వహించేందుకు ముందుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు. త్వరలో చేపట్టబోయే జనగణనలో కులం కాలమ్ ఏర్పాటు చేసి బీసీ జనాభా లెక్కలు తేల్చనుండటం గొప్ప విషయం. రాష్ట్రంలోని బీసీలంతా సీఎం వైఎస్ జగన్‌కు ఎంతో రుణపడి ఉంటారు.

లక్కోజు రాజగోపాలాచారి,
అధ్యక్షుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం

బీసీలు రుణపడి ఉంటారు



రాష్ట్రంలో బీసీల కులగణన చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవడం ఎంతో గొప్ప విషయం. రాష్ట్రంలోని బీసీలంతా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటారు. బీసీలకు సంబంధించిన జనాభా లెక్కలు కచ్చితంగా లేకపోవడం వల్ల ఎంతో నష్టపోతున్నాం. కులగణనతో పరిష్కారం దొరుకుతుంది.

కె.రంగముత్యాలు,
తూర్పుకాపు సంఘం నాయకులు, ఏలూరు

ఏళ్ల నాటి కల నెరవేరింది



జనాభాలో 50 శాతానికి పైగా బీసీలు ఉన్నా ఆ స్థాయిలో రిజర్వేషన్లు, పథకాల్లో వాటా దక్కడం లేదు. దీనిపై ఎన్నో ఏళ్లుగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తూనే ఉన్నాం. బీసీల బాధను అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బీసీల కులగణనపై సానుకూలంగా నిర్ణయం తీసుకోవడం ద్వారా ఎన్నో ఏళ్ల నాటి కల నెరవేరింది. రజకుల తరపున సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

చిలకలపల్లి కట్లయ్య,
ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, రజక జన సంఘం

గుబ్బల మంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



గుబ్బల మంగమ్మ గుడి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని కామవరం అటవీ ప్రాంతంలో కొలువై పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మతల్లి గుడికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతోపాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తుల లారీలు, మినీవ్యాన్‌లు, ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లలో తరలివచ్చి మంగమ్మ తల్లికి పూజలు చేశారు.

తహసీల్దార్ ఫిర్యాదుతో కేసు నమోదు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒక మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తాను విధి నిర్వహణలో ఉండగా దువ్వెల సృజన అనే మహిళ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి విధులకు ఆటంకం కలిగించి బెదిరించినట్లు తహసీల్దార్ ఎస్.శారా శాంతి ఫిర్యాదు చేశారని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హెచ్‌ఎంలను బాధ్యులు చేయడం తగదు



ప్రధానోపాధ్యాయుల సంఘ సమావేశంలో పాల్గొన్న సంఘ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం చేపట్టిన మన బడి నాడు – నేడు కార్యక్రమంలో తలెత్తే సమస్యలకు ప్రధానోపాధ్యాయులను బాధ్యులను చేయడం తగదని జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు డీవీ రమణ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సంఘ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వేసవి సెలవుల ప్రారంభం లోగానే ఉన్నత పాఠశాలలకు రాత్రి కాపలాదారులను ప్రభుత్వం నియమించాలని కోరారు. ప్రతి పాఠశాలకు కంప్యూటర్ ఆపరేటర్, బోధనేతర సిబ్బందిని నియమించాలన్నారు. పాఠశాలలకు మిగిలిన నిధులను పూర్తిస్థాయిలో వెంటనే విడుదల చేయాలని కోరారు. పాఠశాలల విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించేలా తగిన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదు బాక్స్‌లను ప్రధానోపాధ్యాయులు లేక ఉపాధ్యాయులు మండల కార్యాలయాలకు తీసుకువెళ్లడం వంటి చర్యలను నిలుపుదల చేయాలని కోరారు.

మాట నిలబెట్టుకున్న సీఎం జగన్

వలంటీర్‌కు రూ. 3.80 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ సాయం



ఉండిలో వలంటీర్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉండి: ఆపదలో ఉన్న గ్రామ వలంటీర్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఆదుకున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తెలిపారు. ఉండి కొత్తపేటకు చెందిన వలంటీర్ సిరిపురపు దుర్గాసౌమ్య ఏడాదిన్నర క్రితం విద్యుత్‌షాక్‌కు గురైంది. దీంతో కాళ్లు, చేతులు పనిచేయకపోవడంతో కుటుంబీకులు బతికించుకునేందుకు ఎన్నో కష్టాలు పడ్డారు. విషయాన్ని గమనించిన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ దృష్టికి తేవడంతో మూడు నెలల క్రితం నర్సాపురంలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వలంటీర్ ఆరోగ్య పరిస్థితిపై వినతిపత్రం అందజేశారు. స్పందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దుర్గాసౌజన్యకు రూ.3.80 లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్‌ను మంజూరు చేశారు. ఆదివారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ వలంటీర్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి ఆరా తీసి రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసారు. ఈ సందర్భంగా పీవీఎల్ చెప్పారంటే చేసి తీరతారనే విషయం ముఖ్యమంత్రి మళ్ళీ నిరూపించుకున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరమే లేదన్నారు. ఎటువంటి వైద్యమైనా చేయించేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, సర్పంచ్ కమతం సౌజన్య, ఉప సర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ, గ్రామ పార్టీ అధ్యక్షుడు కరిమెరక మల్లిఖార్జున, మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, కరిమెరక శివనాగరాజు, గలావిల్లి ధనుంజయ, మునుకోలు సింహాచలం, బడుగు బాలాజీ, సిరికి ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో ముగిసిన ఐఓటీ గ్రాండ్ ఎక్స్‌పో



ఐఓటీ గ్రాండ్ ఎక్స్‌పో-23లో మోడల్స్‌ను పరిశీలిస్తోన్న డీవీఆర్ మూర్తి

నూజివీడు: స్థానిక ట్రిపుల్‌ఐటీలో మూడు రోజులుగా ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐఓటీ గ్రాండ్ ఎక్స్‌పో–23 ఆదివారంతో ముగిసింది. ఈ ఎక్స్‌పోలో ఈసీఈ విద్యార్థులు ఆరు డొమైన్‌లలో దాదాపు 200 మోడల్స్ ప్రదర్శించారు. చివరిరోజున హైదరాబాద్‌కు చెందిన మాస్‌చిప్ టెక్నాలజీస్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ డీవీఆర్ మూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. సర్టిఫికెట్ అవార్డు కోసం ఆరు డొమైన్‌ల నుంచి ఒక్కొక్కటి చొప్పున ఆరు మోడల్స్‌ను ఎంపిక చేశారు. విజేతలకు సర్టిఫికెట్లను పంపిణీ చేసిన అనంతరం మూర్తి మాట్లాడుతూ నేడు మన చుట్టూ ఉన్న అనేక పరికరాలు మన పనిని సులభతరం చేస్తున్నాయని, అయితే మనతో పనిలేకుండా ఇంటర్నెట్‌లో పనిచేసేవి కూడా ఉన్నాయన్నారు. ఇంటర్నెట్ రాకతో మానవుని జీవితమే పూర్తిగా మారిపోయిందన్నారు. ఐఓటీ అనేది మనకు సౌకర్యవంతమైన, విలాసమైన జీవితం ఇవ్వడానికి ఎంతో దోహదపడుతోందన్నారు. అయితే డేటాకు సంబంధించిన భద్రత, గోప్యత విషయంలో సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులు నిరంతరం పరిశోధనల గురించి ఆలోచనలు చేసి వినూత్న ఆవిష్కరణలకు నాంది పలకాలన్నారు. కార్యక్రమంలో ఈసీఈ హెచ్‌వోడీ పీ శ్యామ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



వేలేరుపాడులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ సీజ్ చేసిన పోలీసులు

వేలేరుపాడు: వేలేరుపాడు మండలంలోని పెదవాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను గుళ్ళవాయి మూల మలుపు వద్ద ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని పాయం నారాయణపై కేసునమోదు చేసినట్లు ఎస్సై శ్రీను తెలిపారు.

● గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఉప్పరగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

పెదపాడు : మండలంలోని ఏపూరు గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవర్లకు అభిషేకం, తీర్థగోష్ఠి, అనంతరం స్వామి వారిని పెండ్లికుమారుడిగా అలంకరించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచన, అగ్ని ప్రతిష్ఠాపన మూర్తి కుంభ ప్రతిష్ఠాపన కళ్యాణోత్సవాంగ హోమం, ధ్వజారోహణం జరిగాయి. సాయంత్రం 6 గంటల నుంచి చతుస్థానార్చనలు రాయభారోత్సవం, ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఇద్దరు పిల్లలతో మహిళ అదృశ్యం

ఆకివీడు: కాళ్ల మండలం సీసలి గ్రామానికి చెందిన మహిళ ఇద్దరు పిల్లలతో ఈ నెల 12న మండలంలోని దుంపగడప బయల్దేరింది. 15న దుంపగడప వెళ్లి చూడగా అక్కడ లేకపోవడంతో ఆమె భర్త ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె.రాజారెడ్డి కేసు నమోదు చేశారు. బంధువులు, ఇతర ప్రాంతాల్లో వెదకగా ఆచూకీ తెలియకపోవడంతో ఫిర్యాదు చేశారన్నారు.

చీటీల నిర్వాహకుడిపై కేసు నమోదు

కొయ్యలగూడెం: చీటీలు కట్టించుకుని మోసం చేశాడనే ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ ఆదివారం తెలిపారు. దిప్పకాయలపాడు గ్రామానికి చెందిన కడిమి సురేష్ చీటీలు కట్టించుకునేవాడు. 2020 సంవత్సరం నుంచి ఈ విధంగా సుమారు రూ.35 లక్షలు ప్రజల వద్ద నుంచి కట్టించుకున్నాడని చీటీలను పాడుకున్న వారికి సొమ్ములు ఇవ్వకుండా గడిపేవాడన్నారు. నిలదీయగా ఇల్లు అమ్మి ఇస్తాను అంటూ గడిపే వాడిని, అదే సమయంలో గ్రామంలోని ఓ ఆసామికి చెందిన కారును తీసుకుని ఆపై కనిపించకుండా పోయాడన్నారు. దీంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం నిందితుల అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ పైడేశ్వరరావు

గణపవరం: బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసులో నిందితులను గణపవరం సీఐ ఎంవీ సుభాష్ ఆధ్వర్యంలో పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఏలూరు డీఎస్పీ పైడేశ్వరరావు ఆదివారం వివరాలు వెల్లడించారు. నిడమర్రు మండలం పెద నిండ్రకొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల దాతలు అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 14న రాత్రి గ్రామానికి చెందిన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు విగ్రహాన్ని ధ్వంసం చేసి పందికోడు కాలువలో పడేశారు. ఈ విషయం తెలిసిన దళిత సంఘాలు ఆందోళనకు దిగాయి. దీనిపై హెచ్‌ఎం ప్రసాద్ నిడమర్రు పోలీసులకు ఫిర్యాదుచేశారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిడమర్రు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. నిందితులను త్వరగా పట్టుకుని శిక్షపడేలా చేస్తానని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాలమేరకు కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన 11 మంది నిందితులను ఆదివారం గ్రామశివారు నర్సింహపురం తూమువద్ద అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ముగ్గురు మైనర్ బాలురు. వీరు గ్రామంలో అలజడి సృష్టించాలన్న ఉద్దేశంతో పాఠశాల గేటు తాళాలు పగులగొట్టి అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు డీఎస్పీ తెలిపారు. పోలీసులు వెతుకుతున్నారన్న భయంతో గ్రామం విడిచి వెళ్లిపోవాలని నిర్ణయించుకుని నాలుగు మోటార్‌సైకిళ్లపై 11 మంది వెళ్తుండగా అనుమానం వచ్చిన సీఐ, ఎస్‌ఐలు, సిబ్బంది విచారించి అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వీరిలో ముత్యాల దుర్గేష్, కానసాల భాస్కరరావు, తోట వెంకటేశ్వరరావు, కర్నాటి నర్సింహమూర్తి, గుండాబత్తుల శ్రీనివాస్, నరమామిడి ప్రశాంత్, దాసరి నరేష్, కర్నాటి వెంకటేషు ఉన్నారు. 24 గంటల్లోనే నిందితులను అరెస్టు చేసిన సీఐ సుభాష్, ఎస్‌ఐలు వెంకటేశ్వరరావు, కేఏ స్వామి ఇతర సిబ్బందిని అభినందించారు.

పాల దిగుబడిపై వడ'దెబ్బ'

- పాడిపశువు వడదెబ్బకు గురైతే చూడి కట్టే అవకాశం లేనట్లే
- ప్రాణాలూ కోల్పోయే ప్రమాదం.. సన్నగిల్లనున్న పాల ఉత్పత్తి
- వేసవిలో కొద్దిపాటి జాగ్రత్తలతో పాడిపశువుల సంరక్షణ భద్రం



నరసాపురం రూరల్: వేసవిలో పాడిపశువుల సంరక్షణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. వేసవిలో పశువులకు వడదెబ్బ తగిలితే పాల దిగుబడి తగ్గడమే కాక పశువులు ఎదకు వచ్చే పరిస్థితులు కనిపించవని, అంతేకాక పశువు చూడుకట్టే అవకాశం ఉండదని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వై.సుధాకర్ చెబుతున్నారు. వేసవిలో పశువులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశువుల్లో సోకే వ్యాధులను ఆయన వివరించారు. వేసవిలో గేదెలు, ఆవులపై సరైన శ్రద్ధ తీసుకోనట్లయితే వడదెబ్బకు గురై ఒక్కొక్కసారి పశువు ప్రాణాలను కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు ఇవే

వేసవిలో పశువులు తాగే నీరు స్వచ్ఛంగా పరిశుభ్రంగా ఉంచాలి. వేసవిలో సహజంగానే నీటి వనరులు తగ్గి నిల్వ ఉండే నీరు మురికిగా, ఆకుపచ్చగా మారతాయి. పశువులు ఈ కలుషితమైన నీరు తాగితే వ్యాధికారక క్రిములు శరీరంలోకి చేరి పారుడు వ్యాధులు కలుగుతాయి. కాబట్టి పశువులు తాగేందుకు స్వచ్ఛమైన నీటిని ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి. లేదంటే రోజులో కనీసం మూడుసార్లు నీటిని అందించడం అవసరం, ఆరుబయట తొట్టెల్లో పగలు నిల్వ ఉన్న నీరు వెచ్చగా మారతాయి. నీడ ప్రాంతంలో నిల్వ ఉంచిన చల్లటి నీటినే పశువులకు తాగించాలి. ఆవులతో పోలిస్తే గేదెలు ఎక్కువ నీటిని తాగుతాయి. వాతావరణ ఉష్ణోగ్రత, గాలిలో తేమ, పశువు వయస్సు తదితరాలనుబట్టి రోజుకు సుమారుగా 28 లీటర్ల నీరు అవసరమవుతాయి. పాలిచ్చే పశువులు అదనంగా ప్రతి లీటరు పాల దిగుబడికి నాలుగు లీటర్ల చొప్పున నీటిని తాగుతాయి. ఇది కాకుండా పశువులను శుభ్రపరిచేందుకు, షెడ్లలో నేలను శుభ్రపరిచేందుకు ప్రతి పశువుకు 110 లీటర్ల నీరు అవసరం పడుతుంది.

వడదెబ్బ తగలకుండా..

పశువులకు వడదెబ్బ తగలకుండా ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పశువుల పాక చుట్టూ పాత గోనెలు కట్టి వాటిని అప్పుడప్పుడు తడుపుతూ ఉండాలి. పైకప్పును కొబ్బరి ఆకులతో గానీ, ఎండి వరిగడ్డితో గాని కప్పాలి. మంచినీరు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేట్లు చూడాలి. పశువులను ఉదయం, సాయంత్రం మాత్రమే అంటే చల్లని వాతావరణంలోనే మేత మేసేందుకు విప్పాలి. పశువులు ఎక్కువగా ఎండలో తిరగకుండా చూడాలి. వీలైనంత పచ్చని మేతను ఇవ్వాలి. సంకర జాతి ఆవులైతే పంకాలు ఏర్పాటు చేయాలి.

వడదెబ్బకు గురైతే లక్షణాలు ఇలా..

వడదెబ్బకు గురైన పశువు లక్షణాలను పరిశీలిస్తే శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీల నుంచి 108 డిగ్రీల వరకు పెరుగుతుంది. పశువులు నడిచేటప్పుడు తూలుతాయి. శ్వాసక్రియ ఎక్కువగా ఉంటుంది. పశువు చాలా నీరసంగా కనబడుతుంది. ఒక్కొక్కసారి కింద పడి కొట్టుకుని స్పృహకోల్పోతాయి. పశువు నీటి కొరకు చూస్తుంటుంది. పశువు చర్మం ఎండిపోయినట్లు ఉంటుంది. పశువులో పాల ఉత్పత్తి కొల్పోతుంది. ఇటువంటి లక్షణాలు ఉంటే వడదెబ్బ తగిలిందని రైతు గ్రహించాలి.

చేయాల్సిన చికిత్స ఇదే

వడదెబ్బ తగిలిన పశువును రైతులు గుర్తించిన వెంటనే చల్లని నీటితో ముఖాన్ని కడగాలి. గుడ్డతో ఐస్ చుట్టి పశువు నుదుటిపై నొత్తాలి. కొద్ది ఊరట కలిగిన తరువాత దగ్గరలోని పశు వైద్యుడిని సంప్రదించి సెలైన్‌లు పెట్టాలి. ఒక్కసారి వడదెబ్బ తగిలిన పశువుకు బతికినంత కా లం పాల దిగుబడి గతంలో మాదిరిగా ఉండదు. జాగ్రత్తలు తీసుకోవాలి.



డాక్టర్ వై సుధాకర్,
పశుసంవర్ధకశాఖ
సహాయ సంచాలకులు

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉత్సాహంగా గడపగడపకు మన ప్రభుత్వం

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా అమలు చేసిన సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందిన వారు 2024లో జరగబోయే ఎన్నికల్లో కృతజ్ఞత చూపాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాలన పట్ల ప్రజల అభిప్రాయంతో పాటు వారికి అందిన సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. అనంతరం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో గత నాలుగేళ్ల కాలంలో రూ.1.60 కోట్ల కుటుంబాలకు రూ.2.07 లక్షల కోట్ల డీబీటీ విధానంలో నేరుగా వారి ఖాతాలకు సొమ్ములు జమ చేశారన్నారు. ఇది చంద్రబాబు, పచ్చమీడియాకు నచ్చడం లేదన్నారు. ఏదో రకంగా ప్రభుత్వంపై బురద జల్లే కార్యక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ఏదో రకంగా రాష్ట్రాన్ని దోచేయాలని 15–20 మంది పెత్తందార్లు చూస్తున్నారన్నారు. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు పచ్చ మీడియా చేస్తున్న ప్రయత్నాలు దారుణంగా ఉన్నాయన్నారు. చంద్రబాబు మహిళలు, రైతుల ఉసురు పోసుకున్నాడన్నారు. ఈ నేపథ్యంలోనే ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అంటూ కార్యక్రమాలు నిర్వహించే పరిస్థితి దాపురించిందన్నారు. జగన్ దేవుడిచ్చిన వరమని, ఆయన గత నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలు కృతజ్ఞత తెలియజేయాలన్నారు. రాబోయే ఎన్నికలు పెత్తందారులు, పేదలకు జరిగే యుద్ధమని పేర్కొన్నారు. ఈ పోరాటంలో జగన్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దండే కనకబాబు, వైఎస్ ఎంపీపీ కట్టా రంగబాబు, ఎమ్పీటీసీలు వీరమళ్ళ వెంకన్న, మార్లపూడి సుబ్బరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వీఎస్ వేణుగోపాల్, ఏపీఎం జీవీకేడీఎం లక్ష్మి, హౌసింగ్ ఏఈ వైవీవెంకట్రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, సచివాలయ కార్యదర్శులు అంకం శ్రీరామకృష్ణ, ఘంటా మానస, మాజీ సర్పంచ్‌లు దాకే పండియ్య, రాపాక భానుమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, ఏలూరి వెంకట్రావు, దండే చినగోతియ్య, దేశాబత్తుల శాంతారావు, దండే వెంకన్న, మరపట్ల సుబ్బారావు, రాపాక అప్పన్న, శీలి వెంకటేశ్వరరావు, హరిదాసుల రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఉప్పరగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు


మహాలక్ష్మీ చెరువులో మహిళలకు పథకాలను వివరిస్తున్న నాయకులు


మాధవరంలో సర్వే చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కొట్టు విశాల్

తణుకు టౌన్: వైఎస్సార్ సీపీ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లోని గృహ సారథులు, సచివాలయ కనీ్వనర్లు, వలంటీర్లు, నాయకులు ఉత్సాహంగా నిర్వహించారు. ఎంపీపీ రుద్ర ధనరాజు, మండల జేసీఎస్ కనీ్వనర్ కరిబండి రాజేష్ తదితరులు మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయన్నారు. తణుకు రూరల్ మండలంలోని వేల్పూరు, దువ్వ, తేతలి, మండపాక, మహాలక్ష్మీ చెరువు, యర్రాయి చెరువు, ముద్దాపురం, కోనాల గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో గృహ సారథులు, వలంటీర్లు ప్రభుత్వ పథకాలపై ప్రజా స్పందనను తెలుసుకున్నారు. తేతలి గ్రామంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, రైతు విభాగం ప్రధాన కార్యదర్శి సరెళ్ల కృపావరం, మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, మండపాకలో ఎంపీటీసీ సభ్యులు కళ్ల సన్యాసిరావు, సొసైటీ అధ్యక్షురాలు వై.విజయమూర్తి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, మహాలక్ష్మీ చెరువు గ్రామంలో సర్పంచ్ పాలా శ్రీను, ఎంపీటీసీ సభ్యురాలు వెంకట దుర్గ, వేల్పూరులో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న తదితరులు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అత్తిలిలో..

అత్తిలి: జగనన్నే మా భవిషత్ కార్యక్రమం ఆదివారం అత్తిలి లక్ష్మీనగర్, చినపేట ప్రాంతాలలో నిర్వహించారు. సంక్షేమమే ధ్యేయంగా, అవినీతికి తావులేకుండా సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు పలుకుతున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు పెన్మెత్స రామరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, గారపాటి నాగరాజు, రంభ సూరిబాబు, గంటా నాగరాజు పాల్గొన్నారు.

మాధవరంలో..

తాడేపల్లిగూడెం రూరల్: ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతీ ఒక్క హామీని అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ నాయకుడు కొట్టు విశాల్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని మాధవరం గ్రామంలో జగనన్న మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సర్వే నిర్వహించారు. అనంతరం కొట్టు విశాల్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ జడ్డు హరిబాబు, నాయకులు వెలిశెట్టి నరేంద్రకుమార్, తారమట్ల శ్రీనివాస్, తమ్మిశెట్టి చుక్కయ్య పాల్గొన్నారు.

ఘనంగా అష్టోత్తర శత కలశాభిషేకం

భీమవరం (ప్రకాశంచౌక్): హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి మందిరం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం అష్టోత్తర శత కలశాభిషేకం ఘనంగా నిర్వహించారు. బుద్ధరాజు వెంకటరామకృష్ణ వెంకటపద్మావతి దంపతులు కలశాభిషేకం పూజలు చేశారు. రాత్రి తాటికొండ కోటేశ్వరరావుగుప్త, సీత మహాలక్ష్మి దంపతులు ఉభయ దాతలుగా స్వామివారి గరుడవాహన సేవలో కాలనీ తిరువీధుల్లో ఊరేగారు. అధ్యక్ష, కార్యదర్శులు కంతేటి వెంకటరాజు, కుక్కల బాల వెంకతరత్నం, సభ్యులు సరిపిడకల రామారావు, జానపాటి మధుసూదనరావు, కడలి వెంకటేశ్వరరావు, అల్లం రమేష్, మట్టా నళిని మోహన్, సూర్యనారాయణరాజు, జయకుమార్, ఫణి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కవురు శ్రీనివాస్‌కు సన్మానం

వీరవాసరం: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీగా గెలుపొందిన జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్‌ను యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. రాబోయే కాలంలో మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జీవీవీ రామానుజరావు, జీవీ రమణరావు, సీహెచ్ కుమారబాబ్జి, ఎం.శ్రీనివాసరావు, బి.కృష్ణారావు, నుదురుపాటి భానుమూర్తి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన


అపార్టుమెంట్ వాసులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది


తాడేపల్లిగూడెంలో అగ్నిప్రమాదాలపై గృహిణులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అత్తిలి: తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని అత్తిలి అగ్నిమాపక కేంద్రాధికారి చేకూరి రాజంరాజు చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అత్తిలిలో ఆదివారం అపార్టుమెంట్ వాసులకు వంటగదిలో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. మంటలు చెలరేగినప్పుడు ఆర్పే విధానాన్ని ఫైర్ ఆఫీసర్ సీహెచ్ రాజన్‌రాజు వివరించారు. ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయిన వారికి అందించాల్సిన ప్రథమ చికిత్స విధానాన్ని తెలిపారు. నీటిలో ప్రయాణించే సమయంలో తప్పని సరిగా లైఫ్ జాకెట్లు వాడాలన్నారు. థియేటర్స్, షాపింగ్ కాంప్లెక్స్, అపార్టుమెంట్‌లలో జరిగే ఎలక్ట్రికల్ ఫైర్ గురించి ఫైర్ ఆఫీసర్ రాజన్‌రాజు వివరించారు. గ్యాస్ ఫైర్, వంటనూనె ఫైర్, ఎలక్ట్రిక్ ఫైర్ అయినప్పుడు మంటలను ఆర్పే విధానం గురించి డెమో ఇచ్చారు.

తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం (టీటీసీ): అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మూడో రోజు ఆదివారం అగ్నిమాపక అధికారి గణేశ్న వెంకట రామారావు ఆధ్వర్యంలో అపార్ట్‌మెంట్‌లోని గృహిణులకు వంట గ్యాస్ సంబంధిత అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక నివారణ పరికరాలతో డెమోలు నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు.

ఫిల్టర్ వాటర్ ప్లాంట్ ప్రారంభం


ఫిల్టర్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా పెదతాడేపల్లి శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో రూ.20 లక్షలు వ్యయంతో శుద్ధి చేసిన వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి శుద్ధి చేసిన నీటిని అందించాలనే ఉద్దేశంతో ఈ ప్లాంట్ ఏర్పాటు చేశారన్నారు. దీనిని పంచాయతీకి స్వాధీనం చేస్తున్నట్లు తెలిపారు. వాటర్ ప్లాంట్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. వాసవి ఇంజినీరింగ్ కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు, ప్రిన్సిపల్ రత్నాకర్‌రావు, సర్పంచ్ కనకబాబు, పంచాయతీ కార్యదర్శి జి.మానస తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాల ప్రచార భేరి యాత్ర


తాడేపల్లిగూడెంలో ప్రచార భేరి యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీని సాగనంపుదామని, దేశాన్ని కాపాడుకుందామని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలో మూడోవ రోజు ఆదివారం సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో శివాలయం వీధి, జువ్వలపాలెం, రిక్షా పుంత, శ్రీదేవి పుంత, సవిత్యపేట, నరసింహారావు పేట, నవ్వారుపేట, తాళ్ళముదునూరుపాడు వార్డులలో ఇంటింటికి తిరుగుతూ ప్రచార భేరి యాత్ర నిర్వహించారు. నాయకులు కర్రి నాగేశ్వరరావు, మండల నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, శిద్ధిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, అల్లం రాము తదితరులు పాల్గొన్నారు.

తణుకులో

తణుకు: బీజేపీ ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద విధానాలను ఎండగట్టి దేశాన్ని కాపాడుకుందామని సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని 30వ వార్డులో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో మూడో రోజు ప్రచార భేరి యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో గుబ్బల వెంకటేశ్వరరావు, బొద్దాని మురళీకృష్ణ, పుట్టా అమ్మిరాజు, బొద్దాని కృష్ణకిశోర్, కామన మునిస్వామి, గార రంగారావు పాల్గొన్నారు.

చలివేంద్రాల ప్రారంభం


జయలక్ష్మి థియేటర్ సెంటరులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొట్టు విశాల్

తాడేపల్లిగూడెం అర్బన్: కొట్టు సత్యనారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో ఎపట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్ చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. ఆర్టీసి బస్టాండ్, శేషమహల్ సెంటర్, రైల్వేస్టేషన్ సెంటర్, ఏలూరు, తణుకు బస్టాపుల వద్ద, జయలక్ష్మి థియేటర్ సమీపంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కొట్టు విశాల్ మాట్లాడుతూ 1994 నుంచి పట్టణంలో ప్రతీ వేసవికాలంలో తన త్రండి కొట్టు సత్యనారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. చలివేంద్రాల నిర్వహణకు ఆయా వార్డుల పార్టీ నాయకులు సహకరించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కర్రి భాస్కరరావు, మునగాల బాబ్జి, వెలనాటి సత్తిబాబు, బొద్దాని శ్రీనివాసు, బొడ్డు సాయిబాబా, గిరిబాబు, గొర్రెల రాజశేఖర్, కోడే శ్రీను, తాళ్ల ప్రసాద్, అడ్డాల నర్సింహరావు, కోల్లాటి బాలాజి, మానికొండ వెంకటేశ్వరరావు, దాసిబాబు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరికి ఘన నివాళి


వేల్పూరులో కందుకూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: నాటక రంగం ద్వారా సాంఘిక సంస్కరణోద్యమాన్ని నడిపిన గొప్ప సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు అని సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు చెప్పారు. ఆదివారం కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా తణుకులోని శ్రీ మారుతీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరేశలింగం పంతులు జయంతిని నాటకరంగ దినోత్సవంగా కూడా జరుపుకుంటున్నారని చెప్పారు. శతాధిక గ్రంథాలను రాసిన, తొలి నాటక కర్తగా వీరేశలింగం పంతులు నిలుస్తారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కందుకూరి జీవిత చరిత్రపై వకృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో కేవీఎస్‌డీ ప్రసాద్, భాగవతుల విజయలక్ష్మీ, పొన్న భ్రమరాంబ, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ నాగరాజు, వీఎస్‌వీ ప్రసాద్, ఎండీ ఆలంగీర్, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూరులో...

సాంఘిక దురాచారాల నిర్మూలనకు పాటుపడిన గొప్ప సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు అని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు చెప్పారు. ఆదివారం కందురూరి వీరేశలింగం 175వ జయంతి సందర్భంగా వేల్పూరులోని ప్రజా సంఘాల భవన్‌లో వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పేకాట శిబిరంపై దాడి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురలో పేకాట శిబిరంపై దాడి చేసి, నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు ఏఎస్సై పీవీకే.దుర్గారావు తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం ముందస్తు సమాచారం మేరకు దాడి చేశామని, నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1570 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఏఎస్సై దుర్గారావు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కేఆర్ సూర్యనారాయణ

సాక్షి, భీమవరం : ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిస్థితులను గమనించి సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ కోరారు. జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు జీఎస్ఎస్ రాజు అధ్యక్షతన భీమవరంలోని త్యాగరాజ భవనలో ఆదివారం నిర్వహించారు. సమావేశంలో సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆస్కార్ రావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జీఎస్ఎస్ రాజు, చంద్రమౌళి పాల్గొన్నారు.

సంచార వైద్యశాలతో వృద్ధులకు సేవలు

తణుకు టౌన్: తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతీ ఆదివారం నిర్వహించే సంచార వైద్యశాల ద్వారా 12 మందికి ఉచిత వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ఆదివారం సంచార వైద్య శాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యులు డాక్టర్ బొండాడ వెంకటేశ్వర్లు సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణం, సజ్జాపురం, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి ఇంటి నుంచి నడవలేని 12 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పైడిపర్రుకు చెందిన అనుమోలు సుబ్బారావు ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

45 మందికి బీపీ, సుగర్ నిర్ధారణ పరీక్షలు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతీ నెలా మూడో ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో 45 మందికి ఉచిత రక్త పరీక్షలు నిర్వహించి సుగర్, బీపీ నిర్ధారణ చేసినట్లు తెలిపారు. తణుకు పట్టణానికి చెందిన సాయి శ్వేత ల్యాబ్ సహకారంతో ఉచితంగా పరీక్షలు చేసి పలు వైద్య సలహాలు, సూచనలు చేసినట్లు తెలిపారు.

కాళ్లకూరులో అన్నసమారాధన

కాళ్ల: కాళ్లకూరులో ఉన్న శ్రీశ్రీ పోలేరమ్మ జాతర మహోత్సవం సందర్భంగా ఆదివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పాల్గొన్నారు. అనంతరం పోలేరమ్మ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ


ఆరవల్లిలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ సుస్మిత

అత్తిలి: మండలంలోని ఆరవల్లి గ్రామంలో నూతనంగా నిర్మించే ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణానికి ఆదివారం గ్రామ సర్పంచ్ వెలగల సుస్మిత శంకుస్థాపన చేశారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా గ్రామానికి రూ. 86 లక్షల నిధులు మంజూరయ్యాయని, ఈనిధులలో కొంతభాగం పైపులైన్ల విస్తరణ, పాడైపోయిన పాత పైపులైన్ల స్థానంలో కొత్త పైపు లైన్లు ఏర్పాటు చేశామని సర్పంచ్ తెలిపారు. గ్రంథాలయం వెనుక 60 వేల లీటర్ల కెపాసిటితో ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెలగల అమ్మిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు దొమ్మేటి రమ్య, కోఆప్షన్ మెంబర్ షేక్ ఫీర్‌బాషా, సెక్రటరీ కె.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఏఈఎల్‌సీ జిల్లా ఉపాధ్యక్షుడిగా వేణు


వేణుకుమార్ దంపతులను సన్మానిస్తున్న చర్చి సంఘ సభ్యులు

పెంటపాడు: పశ్చిమగోదావరి సినడు ఉపాధ్యక్షుడిగా మసీదుపేట సెయింట్‌స్టీఫెన్ లూథరన్ చర్చి గురుమండల అధ్యక్షులు రెవరెండ్ వేణుకుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక చర్చిలో ఆరాధన అనంతరం లూథరన్ సంఘ సభ్యులు, సంఘ పెద్దలు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ నెల 13న నిడదవోలులో 86వ సినడు వార్షిక మహాసభలో రెవ వేణుకుమార్‌ను సినడు ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ పెద్దలు కె.నాగేశ్వరరావు, గారపాటి సోమేశ్వరరావు, ఎస్‌జేడీ బెనర్జీ, మద్రిపూడి తేజోమయకుమారి, ఏలూరి శేఖర్ బాబు తదితరుల పాల్గొన్నారు.

నజీముద్దీన్ సంస్మరణ సభ


అత్తిలిలో మసీదు అధ్యక్షుడు నజీముద్దీన్ సంస్మరణ సభ నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: చిరునవ్వుతోనే స్నేహితులను పలకరించే నజీముద్దీన్ మృతి మిత్రలోకానికి తీరనిలోటని పలువురు మిత్రులు పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నజీముద్దీన్ సంస్మరణ సభ ఆదివారం అత్తిలి షాదీఖానాలో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు తాడిమేటి జయసూర్య మాట్లాడుతూ నజీముద్దీన్ సేవలను కొనియాడారు. గుంటూరు జిల్లా అదనపు ఎస్పీ అరిటాకుల శ్రీనివాసరావు, రిటైర్డు డిఎస్పీ పంజా భరత్‌మాతాజీ, భీమవరం డీఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రప్రసాద్, రాజమహేంద్రవరం సీఐ గాజుల సత్యనారాయణ, పోలిశెట్టి సూర్యచంద్రరావు, బండి అంజన్న, మసీదు ఇమామ్ , చిన్న గురువు, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



డాక్టర్ దామోదరరెడ్డిని సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): లయన్స్‌క్లబ్ వారి సేవా కార్యక్రమాల్లో భాగంగా క్లబ్ వారి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో దాత పదమ్‌కుమార్ గుప్తా ఆధ్వర్యంలో నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణ నేత్ర వైద్యశాల వారితో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ దామోదరరెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ మరన్ని సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. వైద్య శిబిరంలో 105 మంది రోగులకు కంటి పరీక్షలు చేశారు. కంటి ఆపరేషన్‌లు నిమిత్తం 15 మందిని నిడదవోలు ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు, 20 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించేందుకు నిర్ణయించారు.

ఘనంగా ముళ్లమాంబికా అమ్మవారి జాతర

తణుకు టౌన్: మండలంలోని ముద్దాపురం గ్రామంలో ఉన్న శ్రీ ముళ్లమాంబికా అమ్మవారి జాతర మహోత్సవాలను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించి అమ్మవారి గ్రామోత్సవం ఆకట్టుకుంది. ఉత్సవ కమిటీ చైర్మన్ ముళ్లపూడి వెంకట సుబ్బారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. తణుకు రూరల్ సీఐ సీహెచ్ అంజనేయులు, ఎస్సై గురవయ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నేటి నుంచి పాలిసెట్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

పెంటపాడు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నుంచి పాలిసెట్-2023 హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత కోచింగ్ అందించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.ఫణీంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పదోతరగతి పరీక్షలు రాసి పాలిటెక్నిక్‌లో చేరాలనుకునే విద్యార్థులు ఈ కోచింగ్‌కు అర్హులన్నారు. ఈ నెల 17 నుంచి మే నెల 7 వరకు జరగబోయే ఈ ఉచిత కోచింగ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మే 10న పెంటపాడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ పాలిసెట్-2023 పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 90322 66450, 94901 04336 ఫోన్ చేసి ఇతర వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

విధి నిర్వహణలో ఏఎస్సైకి అస్వస్థత

తణుకు: విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారి అస్వస్థతకు గురయ్యారు. తణుకు మండలం ముద్దాపురం గ్రామంలో జరుగుతున్న జాతర మహోత్సవాల్లో భాగంగా విధి నిర్వహణలో ఉన్న ఏఎస్సై గంటి శ్రీనివాసరావు ఆదివారం తెల్లవారుజామున లోబీపీ కారణంగా కుప్పకూలిపోయారు. దీంతో స్పందించిన తోటి సిబ్బంది హుటాహుటిన 108 ద్వారా తణుకులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఏఎస్సై శ్రీనివాసరావు కోలుకుంటున్నట్లు సీఐ ఆంజనేయులు వెల్లడించారు.

ప్రభుత్వాసుపత్రి ఎదుట పోలీసుల బందోబస్తు

తణుకు: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆదివారం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇరగవరం మండలం తూర్పువిప్పర్రు గ్రామంలో అంబేద్కర్ ఫ్లెక్సీ ధ్వంసం ఘటనలో ఇరు వర్గాలకు మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఈ సమయంలో మరోసారి తణుకు ప్రభుత్వాసుపత్రి వద్ద ఘర్షణలు జరిగే అవకాశం ఉందని భావించిన పోలీసు అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా ఆసుపత్రి ఎదుట భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తణుకు పట్టణ సీఐ ముత్యాల సత్యనారాయణ, ఎస్సై జానా సతీష్ ఆధ్వర్యంలో సిబ్బంది పహారా ఉన్నారు. అనుమానితులను ఆసుపత్రిలోకి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు.

శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం (టీటీసీ): చైత్ర బహుళ ఏకాదశి పురస్కరించుకొని ఆదివారం స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలోని శ్రీకృష్ణపరమాత్మకు పంచామృతాలతో అభిషేకాలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. అనంతరం సామూహిక భగవద్గీత పారాయణం నిర్వహించారు. పూజలను మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.